నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, గురువారం 23 జనవరి 2025 | HYDERABAD

అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి: ఎమ్మెల్యే మర్రి

మల్కాజిగిరి, జనవరి 22: అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లతో పాటు రేషన్‌కార్డులను ప్రభుత్వం మంజూరు చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇండ్లు, తెల్ల రేషన్ కార్డుల పంపిణీ పారదర్శకంగా ఉండాలన్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు జాబితాలో పొందుపర్చలేదని, నూటికి 5 మంది చొప్పున లబ్ధిదారులను ప్రభుత్వం గుర్తించడాన్ని గట్టిగా ప్రశ్నించాలన్నారు. అధికారులు పారదర్శకంగా పనిచేయకపోతే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్ రెడ్డి, అంజయ్య, కరంచంద్, జగదీశ్‌గౌడ్, పరశురాంరెడ్డి, మురుగేశ్, అమీనుద్దీన్, లక్ష్మణ్ యాదవ్ పాల్గొన్నారు.

బుధవారం కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

అంగట్లో అవయవాలు

జీవన్‌దాన్ అనుమతి లేకుండానే యథేచ్ఛగా కిడ్నీ మార్పిడిలు



మరోసారి బయటపడిన వైద్య, ఆరోగ్యశాఖ డొల్లతనం

నగరంలో మానవ అవయవ రవాణా జరుగుతున్నట్లు గుర్తించిన విచారణ కమిటీ

సుమోటోగా స్వీకరించిన తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి

హైదరాబాద్ కేంద్రంగా మనిషి అవయవాలు అంగట్లో సరుకుగా మారుతున్నాయి. వైద్య, ఆరోగ్యశాఖ పర్యవేక్షణా లోపం, కొందరు అధికారుల ధన దాహంతో ఒక పక్కన నకిలీ డాక్టర్లు పుట్టుకొస్తుండగా మరో పక్కా మానవ రవాణా తరహాలో అవయవ రవాణా సాగుతున్నట్లు అలకానంద కిడ్నీ రాకెట్ ఘటనతో తేటతెల్లమైంది. గత సంవత్సరం జూలైలో 9 పడకల సామర్థ్యంతో అనుమతి పొందిన అలకానంద దవాఖానను సుమంత్ అనే వ్యక్తి నిర్వహిస్తున్నాడని, అధికారికంగా కేవలం ఒక ఫిజీషియన్, ఒక సర్జన్‌లకు మాత్రమే ఈ దవాఖానకు అనుమతి ఉన్నట్లు రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి వెల్లడించారు. ఇదిలా ఉండగా అనుమతిచ్చిన అధికారులు ఆరునెలలుగా దవాఖానవైపు తొంగి చూడకపోవడంతో అలకానంద దవాఖాన అవయవాల అంగడిగా మారింది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 41 హాస్పిటల్స్‌కు మాత్రమే జీవన్‌దాన్ అనుమతి ఉంది. అలకానంద దవాఖానలో మాత్రం జీవన్‌దాన్ అనుమతి లేకుండానే ఎలాంటి నియమ నిబంధనలు, మార్గదర్శకాలు పాటించకుండానే యథేచ్ఛగా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు జరుపుతున్నారు. అయితే ఈ వ్యాపారం ఎంత కాలం నుంచి నడుస్తుందో, ఇంకా ఏయే ప్రాంతాల్లో నడుస్తుందో తెలియాల్సి ఉంది.

- సిటీబ్యూరో, జనవరి 22 (నమస్తే తెలంగాణ)/ఎల్బీనగర్:

అజ్ఞాత వ్యక్తి సమాచారంతోనే..

అజ్ఞాత వ్యక్తి సమాచారంతో బయట పడిన కిడ్నీ రాకెట్ ఎంత కాలం నుంచి నడుస్తుందో అనే అంశంపై విచారణ కమిటీ లోతుగా దర్యాప్తు జరుపుతోంది. అయితే అజ్ఞాత వ్యక్తి సమాచారం ఇవ్వకపోతే ఈ కిడ్నీల వ్యాపారం యథేచ్ఛగా కొనసాగేది. కనీసం కొత్తగా అనుమతి పొందిన దవాఖానలపైన కూడా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు పర్యవేక్షణ చేయకపోవడం గమనార్హం. అనుమతులు, తనిఖీలు చేయాల్సిన అధికారులు తూతూ మంత్రంగా కూర్చున్న చోట నుంచే మమ అనిపించుకోవడంతో వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలోని ఒక ఉద్యోగియే అంతా తానై బయటి వ్యవహారాలను చక్కబెడుతూ కోట్లకు పడిగెడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా సదరు ఉద్యోగి కొందరు సంబంధిత అధికారులకు వాటాలు ముట్టజెప్పడంతో వారు కూర్చున్న చోట నుంచి లేవకపోవడంతో ఇలాంటి కిడ్నీ దందాలు, లింగ నిర్ధారణ వంటి ఉదంతాలు చోటుచేసుకుంటున్నట్లు ఆరోగ్యశాఖ సిబ్బందే ఆరోపిస్తున్నారు.

పేదోల కిడ్నీ ఖరీదు రూ.4లక్షలు

ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేదల అవసరాన్ని ఆసరాగా చేసుకుని కిడ్నీ మాఫియాలు అంగట్లో సరుకులా పేదల మూత్రపిండాలను అమ్ముకుంటున్నాయి. ఈ క్రమంలోనే తమిళనాడుకు చెందిన ఇద్దరు మహిళలకు రూ.4లక్షల చొప్పున చెల్లించి అలకానంద హాస్పిటల్‌లో కర్ణాటకకు చెందిన ఒక వ్యక్తితో పాటు మరో మహిళకు మార్పిడి చేసినట్లు విచారణలో తేలింది. దీనికి సంబంధించి స్కానింగ్ చేయగా ఇద్దరు మహిళలు తమ కిడ్నీలను దానం చేసినట్లు, మరో ఇద్దరు మార్పిడి చేయించుకున్నట్లు విచారణ కమిటీ నిర్ధారించింది. అయితే ఒక్కో కిడ్నీ మార్పిడి రూ.55లక్షలకు జరిపారని, అందులో రూ.4లక్షలు డోనర్‌కు, 10లక్షలు బ్రోకర్‌కు, మిగిలిన రూ.51లక్షలు నిర్వాహకులు పంచుకున్నట్లు విచారణ కమిటీ ప్రాథమికంగా గుర్తించింది. అయితే ఈ పంపకాలలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలోని సిబ్బంది ఎవరికైనా వాటా ఉందా అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో ఆర్గాన్ ట్రాఫికింగ్..

హైదరాబాద్‌లో మానవ అక్రమ రవాణా మాదిరిగానే మానవ అవయవ రవాణా వంటి అక్రమ కార్యకలాపాలు నడుస్తున్నట్లు అలకానంద ఘటనపై ఏర్పాటు చేసిన విచారణ కమిటీ గుర్తించినట్లు సమాచారం. జరిగిన ఘటనపై విచారణ కోసం ప్రభుత్వం నలుగురు ప్రొఫెసర్లతో కూడిన కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు కమిటీ సభ్యులు బుధవారం దవాఖానను పరిశీలించారు. అయితే దవాఖాన సీజ్ చేసి ఉంచడంతో బయట నుంచే పరిశీలించి, అక్కడ కిడ్నీ మార్పిడి చేయించుకున్న రోగులు, వారికి కిడ్నీ దానం చేసిన దాతలను విచారించారు.

సుమోటోగా స్వీకరించిన తెలంగాణ వైద్యమండలి

కిడ్నీరాకెట్ ఉదంతాన్ని సుమోటోగా స్వీకరించిన తెలంగాణ వైద్యమండలి.. నిర్వాహకులకు నోటీసులు జారీచేసింది. ఈ క్రమంలో దవాఖాన ఎవరి పేరున రిజిస్టర్ అయ్యి ఉంది.. అక్కడ పనిచేసిన వైద్యులు వైద్యవిద్యను ఎక్కడ పూర్తిచేశారు. అసలు వారు తెలంగాణ వైద్య మండలిలో రిజిస్ట్రేషన్ అయ్యారా లేదా తదితర అంశాలపై ఆరా తీస్తున్నట్లు మండలి ఉపాధ్యక్షులు డా.శ్రీనివాస్ తెలిపారు. కిడ్నీ మార్పిడి రాకెట్‌లో శస్త్రచికిత్సలు జరిపిన వైద్యుల అర్హతపై కూడా దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.



ముఠాలను కఠినంగా శిక్షించాలి

సుల్తాన్‌బజార్: పేదరికాన్ని అడ్డుపెట్టుకొని అమాయకుల కిడ్నీలను మార్పిడికి యత్నిస్తున్న ముఠాలను కఠినంగా శిక్షించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ)తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ దువ్వూరు ద్వారకానాథ్‌రెడ్డి, సెక్రటరీ డాక్టర్ అశోక్ బుధవారం ఓ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నగరంలోని అలకానంద ఆస్పత్రిలో కిడ్నీల దానానికి వచ్చిన బాధితులు, కిడ్నీల మార్పిడికి వచ్చిన రోగులను, ఆసుపత్రి యజమాని సుమంత్‌ను టాస్క్‌ఫోర్స్ బృందం అదుపులోకి తీసుకున్న ఘటన ప్రజలను, వైద్యులను తీవ్ర ఆందోళనకు గురిచేసిందని చెప్పారు. అక్రమంగా కిడ్నీల మార్పిడికి పాల్పడిన ప్రతి ఒక్కరిని కఠినంగా శిక్షించాలని, భవిష్యత్‌లో ఇలాంటివి పున రావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు కూడా తీసుకోవాలన్నారు.

తులం బంగారం హామీ అమలేది?

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట, జనవరి 22: తులం బంగారం హామీని ఎప్పుడు అమలు చేస్తారనేది ప్రభుత్వం స్పష్టం చేయాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం బేగంపేటలోని సికింద్రాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో 108 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. ఎన్నికల ముందు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా.. ఇవ్వడం లేదని పలువురు లబ్ధిదారులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రభుత్వానికి లబ్ధిదారుల తరపున నివేదికను అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఆడబిడ్డ పెండ్లి అంటే ఆర్థికంగా ఎంతో భారమని, వారికి కొంత ఆసరాగా ఉండాలనే ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష నూట పదహార్లు ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించి.. కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఈ పథకంలో లక్షలాది కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించినట్టు వివరించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఆర్థిక సహాయంతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటిందని, ప్రభుత్వం ఇస్తామని చెప్పిన తులం బంగారం ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్థిక సహాయం ఆలస్యం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

మానవతాదృక్పథంతో వ్యవహరించాలి

పుట్‌పాత్ వ్యాపారుల పట్ల ప్రభుత్వ అధికారులు మానవత దృక్పథంతో వ్యవహరించాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని వందలాది మంది పుట్‌పాత్ వ్యాపారులు, హాకర్స్ వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి వారి బాధలను విన్నవించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం సికింద్రాబాద్ సర్కిల్ కార్యాలయంలో జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీస్ అధికారులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. సుమారు 50 ఏండ్ల నుంచి పుట్‌పాత్‌లపై, తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తూ కుటుంబాలను పోషిస్తున్నారని వివరించారు. వారి వ్యాపారాలను తొలగిస్తే ఆయా కుటుంబాలు రోడ్డున పడతాయని, పేదల జీవనోపాధిని దెబ్బ తీయవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రవికిరణ్, ట్రాఫిక్ ఏసీపీ శంకర్రాజు, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి.. మా బతుకులు కూల్చావ్!

40 ఏండ్లుగా వ్యాపారం చేసుకుంటున్నాం

మాకు దారి చూపకుంటే ఆత్మహత్యలే దిక్కు

చింతలబస్తీలో చిరు వ్యాపారుల ఆవేదన

నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేతలు

చేపట్టారంటూ ఆరోపణ

కాంగ్రెస్ సర్కారు బాగుపడదంటూ.. శాపనార్థాలు

ఖైరతాబాద్, జనవరి 22 : దశాబ్దాలుగా చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్న పేదల బతుకులు రోడ్డున పడ్డాయి. 40 ఏండ్లుగా చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొని కుటుంబాలను పోషించుకుంటున్న వారి జీవనాధారం నేలమట్టమైంది. బుధవారం ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ సంయుక్తాధ్వర్యంలో ఖైరతాబాద్‌లోని చింతలబస్తీలో ఆక్రమణల పేరుతో చేపట్టిన కూల్చివేతలతో సుమారు 100 మంది తమ జీవనాధారాన్ని కోల్పోయారు. సుమారు 145 మంది పోలీసులు, జీహెచ్ఎంసీ సిబ్బంది గట్టి బందోబస్తు మధ్య నాలుగు జేసీబీలతో బుధవారం ఉదయం నుంచి కూల్చివేతలు ప్రారంభించారు. ఎలాంటి నోలీసులు ఇవ్వకుండానే చిరు వ్యాపారాలను కూల్చివేయడంతో బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ బతుకులు కూల్చిండంటూ శాపనార్థాలు పెట్టారు. 'మాకు దారి చూపకుంటే ఆత్మహత్యలే శరణ్యం' అంటూ వాపోయారు.

కుండలు అమ్ముకొని జీవిస్తున్నాం

40 ఏండ్ల నుంచి ఇక్కడ కుండలు అమ్ముకుంటూ జీవిస్తున్నాం. శుభకార్యాలు జరిగినప్పుడు.. ఎండాకాలంలో మాత్రమే తమ కుండలకు గిరాకీ ఉంటుంది. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఉన్న నా డబ్బాను కూల్చివేశారు. నా కుటుంబానికి దిక్కెవరూ. ఉద్యోగమేమైనా ఇస్తారా.. ఎలాంటి ఆసరా చూపకుండా ఎలా కూల్చివేస్తారు. ఏ ప్రభుత్వం కూడా ఇంత దారుణానికి పాల్పడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి మా కొంపలను ముంచింది. మాకు ఇక దిక్కెవరూ.. ఎలా బతకాలి.

- పుష్ప, చింతలబస్తీ

నోటీసులివ్వకుండా కూల్చివేయడం దారుణం

సంవత్సరాల నుంచి కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాలు ఇక్కడ వ్యాపారాలు చేసుకొని జీవిస్తున్నాయి. ఇంత వరకు ఏ ప్రభుత్వం కూడా చిరు వ్యాపారులపై దాడులు చేయలేదు. రోజంతా కష్టపడి వ్యాపారం చేస్తే నోటికి ఇంత బువ్వ అందుతుంది. ఉన్న ఆ ఆధారాన్ని తొలగిస్తే పేదలు ఎలా బతకాలి. కూల్చివేతల్లోనూ అధికారులు కర్కషంగా వ్యవహరిస్తున్నారు. దివ్యాంగుల ర్యాంపులు, ఇంటి ముందు మెట్లు, పుత్‌పాత్‌లు, పార్కింగ్ కోసం చేసిన నిర్మాణాలను కూల్చివేస్తున్నారు. వాహనాలు ఎక్కడ పార్కు చేసుకోవాలో షాపులను కూల్చివేస్తున్న అధికారులే సమాధానం చెప్పాలి. నెల రోజుల ముందు నోటీసులు ఇచ్చి కూల్చివేయాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా కూల్చివేస్తున్నారు. ఇది ప్రభుత్వానికి మంచిది కాదు. **- అనిల్ చందర్, చింతలబస్తీ**

ఈ ప్రభుత్వం బాగుపడదు

నా కొడుకు కోడలు చిన్న డబ్బా దుకాణం పెట్టుకొని పేపర్లు అమ్ముకుంటూ జీవిస్తున్నారు. నా కొడుకు చదివిన చదువుకు ఉద్యోగం రాక, ఈ చిన్న వ్యాపారం చేసుకొని భార్య, పిల్లలతో జీవిస్తున్నాడు. ఉన్న ఒక్క ఆధారాన్ని కూల్చివేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కనికరం లేదు. కూల్చడానికి మా పేదల వ్యాపారాలే కావాలా....బడా బాబులు కబ్జాలు చేస్తే పట్టించుకోరు.... మా పేదలు చిన్న షెడ్డు వేసుకొని దుకాణం నడిపస్తుంటే విరుచుకుపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బాగుపడదు. **- అంజమ్మ, చింతలబస్తీ**

ఎమ్మెల్యే దానం హెచ్చరికలు.. లెక్కచేయని అధికారులు

బింతలబస్తీలో చిరువ్యాపారాల కూల్చివేతలు జరుగుతుండగా, అటువైపు వచ్చిన ఎమ్మెల్యే దానం నాగేందర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కూల్చివేతలను ఆపాలని, లేకుండా ఇక్కడే బైఠాయించి అవసరమైతే ధర్నా చేస్తానని హెచ్చరించారు. అయినా అధికారులు లెక్క చేయలేదు. ఈ నేపథ్యంలో నగరంలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో కూల్చివేతలను పర్యవేక్షిస్తున్న ఓ అధికారికి ఫోన్ చేసినట్లు తెలిసింది. ఆ అధికారితో ఏం సంభాషణలు జరిగాయో తెలియదు. కూల్చివేతలు ఆపకుంటే ఇక్కడే కూర్చుంటానని చెప్పిన ఎమ్మెల్యే దానం నాగేందర్.. అధికారులను హెచ్చరించి వెళ్లిపోయారు. ఆ తర్వాత ప్రారంభమైన కూల్చివేతలు రాత్రి వరకు కొనసాగాయి. చింతలబస్తీలో రోడ్డు ఆక్రమణలను కూల్చివేస్తున్న క్రమంలో స్థానికులు కొందరు నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో అక్కడికి చేరుకున్న ఆయన కూల్చివేతలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అంతలోనే బీజేపీ నేత దిలీప్ కుమార్ తన అనుచరులతో అక్కడికి చేరుకోవడంతో కొంత గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో పోలీసులు ఇరు వర్గాలను శాంతింపచేశారు. అనంతరం వారిద్దరూ అక్కడి నుంచి వెళ్లిపోవడంతో కూల్చివేతలు కొనసాగాయి.

గ్యారంటీల గందరగోళం

పరస్పర ప్రకటనలతో దరఖాస్తుదారుల విస్మయం

జాబితాలో అర్హులు లేరంటూ..

వార్డు సభల్లో కాంగ్రెస్ నేతల ఆరోపణలు

అధికారులతో వాగ్వాదం..

రీ సర్వేకు డిమాండ్

మేడ్చల్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): గ్యారంటీల అమలు అంతా గందరగోళంగా మారింది. నాలుగు గ్యారంటీల అమల్లో ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను సర్వేచేసి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని చెప్పిన సర్కారు ప్రకటన.. పొంతన లేకుండా పోతున్నది. గ్రామ, వార్డు సభలను నిర్వహించి ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల్లో అర్హులను ఎంపిక చేసి ఈ నెల 21 నుంచి జరగుతున్న గ్రామ, వార్డు సభల్లో ప్రజల సమక్షంలో ప్రకటించి.. అభ్యంతరాలను స్వీకరిస్తామన్న విషయం తెలిసిందే. అర్హుల జాబితాలో తమ పేర్లు లేవంటూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు జరిగాయి. దీంతో మళ్లీ అధికారులు మాట మార్చారు. గ్రామ, వార్డు సభల్లో ప్రకటించిన జాబితాలో పేర్లు రాని వారు మళ్లీ దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. తాజాగా, ప్రభుత్వం గ్రామ, వార్డు సభల్లో ప్రకటించే జాబితా దరఖాస్తులు మాత్రమేనని..ఎవరూ ఆందోళన చెందవద్దని దరఖాస్తుల జాబితాలో లేని వారందరూ దరఖాస్తులు చేసుకోవచ్చని అధికారుల ప్రకటనలతో గ్యారంటీ పథకాల వర్తింపుపై వస్తున్న ప్రకటనలతో దరఖాస్తుదారులు విస్మయనికి గురువుతున్నారు. రెండో రోజూ అదే సీన్..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా బుధవారం జరిగిన గ్రామ, వార్డు సభల్లో రెండో రోజూ అదే సీన్ రిపిట్ అయింది. గ్రామ, వార్డు సభల్లో ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా లబ్ధిదారుల పేర్లను చదివిన క్రమంలో అర్హుల జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో అధికారులను నిలదీస్తూ ఆందోళనలు చేశారు. ఆందోళన చేసిన దరఖాస్తుదారులు మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని, ఇందులో అర్హులు ఉంటే పథకాలు అందిస్తామని చెప్పిన అధికారుల మాటలతో దరఖాస్తుదారులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. ప్రజాపాలనలో చేసిన దరఖాస్తులకు విలువ లేదా అని అధికారులను ప్రశ్నించారు. అర్హుల జాబితాలో పేర్లు లేని వారు నిరుత్సాహానికి గురవుతూనే తిరిగి దరఖాస్తులు చేసుకున్నారు.

పథకాల ఎంపికపై విమర్శలు..

నాలుగు గ్యారంటీల అమల్లో భాగంగా అధికారులు చేసిన సర్వేలో అవకతవకలు ఉన్నాయని గ్రామ, వార్డు సభల సాక్షిగా కాంగ్రెస్ నాయకులే ఆరోపించడం గమనార్హం. ఉద్దమర్రికి చెందిన కాంగ్రెస్ నాయకులు దొసకాల వెంకటేశ్, విష్ణుగౌడ్, కృష్ణారెడ్డి, మధు, వెంకట్‌రెడ్డి ఆరోపిస్తూ.. అధికారులతో వాగ్వాదానికి దిగారు. గ్రామ, వార్డు సభల్లో ప్రకటించిన జాబితాలో అసలు అర్హులే లేరని ఆరోపిస్తూ రీ సర్వే చేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెసోళ్లు అనుకున్నోళ్లకే రేషన్ కార్డులు

కాంత్రసోళ్లు కుట్రలు చేసి.. వాళ్లు అనుకున్నోళ్లకే రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తుండ్రు. రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్లు కావాలని దరఖాస్తు పెడితే.. ఒక్కటి కూడా ఇవ్వలేదు. గతంలో పథకాలు వస్తే పార్టీలు చూడలేదు. అర్హులై ఉన్న వాళ్లందరికీ ఇచ్చిండ్రు. ఇప్పుడేమో కాంగ్రెస్ వాళ్లకే ఇస్తుండ్రు. ఇదెక్కడి న్యాయమని అడిగితే మళ్లీ దరఖాస్తు పెట్టుకోమంటున్నారు. అందరికీ సమానంగా పథకాలు పంచాలే తప్ప.. వివక్ష చూపొద్దు.

-గుండె మంజుల, ఘట్‌కేసర్

కాంగ్రెసోళ్లకే ఇందిరమ్మ ఇండ్లు

నా కుడి చెయ్యి సరిగా పనిచేయదు. కాంగ్రెసోళ్లకు తప్ప.. అర్హులెవరికీ ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో పేర్లు రాలేదు. కిరాయి ఇండ్లలో ఉంటున్నా.. మమ్మల్నీ వదిలేసి కాంగ్రెస్ కార్యకర్తలకే ఇస్తుండ్రు. నాకు పింఛన్, రేషన్‌కార్డు, ఇల్లు ఏదీలేదు. అప్పుడు అన్నీ ఇస్తామని చెప్పి ఓట్లు వేయించుకొని.. ఇప్పుడు రేపు మాపు అంటూ తిప్పుతుండ్రు. మా పేరు ఎందుకు రాలేదని గట్టిగా అడిగితే మళ్లీ దరఖాస్తు చేసుకోమని చెబుతుండ్రు. **-లక్ష్మి కురుమ, ఇందిరనగర్‌కాలనీ, చెంగిచర్ల బోడుప్పల్**

అవగాహన లేకుండానే సభలు

రేవంత్ రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చే ముందు ఇస్తామన్న ఒక్క హామీ కూడా ఆచరణలో లేదు. రేషన్ కార్డు రాలే, ఇందిరమ్మ ఇండ్లు రాలేదు. అంగు ఆర్భాటాలతో సభలు పెట్టిండ్రు. ఏమి చెబుతున్నారో వారికే తెలియదు. అవగాహన లేకుండానే సభలు పెట్టి నమ్మించేందుకు మాయమాటలు చెబుతున్నారు. వాళ్ల మాటలు నమ్మ బుద్ధి కావడం లేదు. ఈ ప్రభుత్వం ఉన్నంత కాలం ఏదీ రాదని అర్థమైంది. **- సిద్దుల శ్యామల, ఘట్‌కేసర్**

13 కిలోమీటర్లు.. 10 మెట్రో స్టేషన్లు

సిటీబ్యూరో:రెండో దశ మెట్రో విస్తరణలో భాగంగా చేపట్టనున్న మియాపూర్-పటాన్‌చెరు మెట్రో వివరాలను హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో అథారిటీ వెల్లడించింది.మియాపూర్ నుంచి పటాన్ చెరు వరకు 13 కిలోమీటర్ల మేర మెట్రో నిర్మించే ఈ మార్గంలో రాబోయే మెట్రో స్టేషన్ల వివరాలను అధికారికంగా మెట్రో సంస్థ వెల్లడించింది. 13 కిలోమీటర్ల అందుబాటులోకి వచ్చే మెట్రో మార్గంలో 10 స్టేషన్లతో డెవలప్ చేయనున్నారు. మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు ఎలివేటెడ్ కారిడార్‌లోనే మెట్రో రాకపోకలు నిర్వహించనున్నారు. ఫేస్-2లో నిర్మించనున్న కారిడార్ - 7లో ఉన్న మియాపూర్-పటాన్‌చెరు మెట్రో నిర్మాణానికి రూ.4107 కోట్లు ఖర్చు చేయనున్నారు. మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి మొదలుకుని మియాపూర్ క్రాస్ రోడ్డు, అల్విన్ క్రాస్ రోడ్డు, మదీనాగూడ, చందానగర్, బీహెచ్ఈఎల్, జ్యోతినగర్, బీరంగూడ, ఆర్‌సీ పురం, ఇక్రిసాట్, పటాన్‌చెరు స్టేషన్లను నిర్మించనున్నారు. ఈ మార్గంలో 2028 నాటికి కనీసం 1.65లక్షల మంది ప్రయాణించే అవకాశం ఉన్నట్లు మెట్రో సంస్థ అంచనా వేసింది. హైదరాబాద్ నుంచి సంగారెడ్డి జిల్లాలను మెట్రో అనుసంధానం చేయనున్నారు.

పారిశ్రామిక కారిడార్‌గా గుర్తింపు పొందిన ఈ మార్గంలో ప్రస్తుతం ఆర్టీసీ, ప్రైవేటు వాహనాలే ప్రధాన రవాణా సదుపాయాలు పొందుతుండగా.. అందుబాటులోకి వచ్చే మెట్రోతో మియాపూర్ నుంచి పటాన్‌చెరు మధ్య ట్రాఫిక్ సమస్యలను కూడా పరిష్కరించడంలో మెట్రో కీలక పాత్ర పోషించనుంది.